
సాక్షి
కుమురం భీం
ఆదివారం । 13 । జూలై । 2025



అరచేతిలో 'నా పంచాయతీ'

కేంద్ర ప్రభుత్వం మేరీ పంచాయతీ(నా పంచాయతీ)అనే యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. అభివృద్ధి పనులు, నిధుల వినియోగం గురించి తెలుసుకోవచ్చు. 8లో▸



పెచ్చులూడుతున్న 'వసతిగృహం'

వాంకిడి మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర సంక్షేమ వసతి గృహం శిథిలావస్థకు చేరింది. 1995లో ప్రారంభించిన భవనం కూలడానికి సిద్ధంగా ఉంది. 9లో▸


గరిష్టం/కనిష్టం
33.3 /26.3

వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. ఉక్కపోత పెరుగుతుంది. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్


సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మంత్రివర్గ సమావేశంలో ఆమోదం తెలపడంతో శనివారం జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి ఎమ్మెల్సీ విఠల్, డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాదరావు, నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం బీసీలకు అన్యాయం చేసిందని ఆరోపించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, జెడ్పీ మాజీ చైర్మన్ గణపతి, మాజీ ఎంపీపీ బాలేశ్వర్‌గౌడ్, నాయకులు అనిల్‌గౌడ్, సోమశేఖర్, చరణ్, శ్యాం తదితరులు పాల్గొన్నారు.


మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న డీఎస్పీ రామానుజం

దహెగాం(సిర్పూర్): యువకులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం అన్నారు. మండలంలోని కుంచవెల్లి గ్రామంలో శనివారం మండల స్థాయి వాలీబాల్ పోటీలు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ యువతీ యువకులు చెడు వ్యసనాలు వీడాలని సూచించారు. మాదకద్రవ్యాలు, ఇతర మత్తు పదార్థాలు వాడినా, విక్రయించినా వెంటనే 1908, 8712670551 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు. యువతను క్రీడల్లో ప్రోత్సహించేందుకు క్రీడాపోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ పోటీల్లో వివిధ గ్రామాల నుంచి 16 జట్లు పాల్గొన్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాగజ్‌నగర్ రూరల్ సీఐ శ్రీనివాస్‌రావు, ఎస్సై విక్రమ్, సిబ్బంది, క్రీడాకారులు పాల్గొన్నారు.

జీవో 49 రద్దుపై గ్రామాల్లో సీపీఎం ప్రచారం



ప్రచారం చేస్తున్న సీపీఎం నాయకులు

కాగజ్‌నగర్‌రూరల్: జీవో నంబర్ 49 రద్దు చేయాలని కాగజ్‌నగర్ మండలం రేగులగూడ, ఊట్‌పల్లి గ్రామాల్లో శనివారం సీపీఎం నాయకులు కరపత్రాలతో ప్రచారం చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి కూశన రాజన్న మాట్లాడుతూ ఆదివాసీలను జల్ జంగిల్ జమీన్‌కు దూరం చేసే జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభావిత గిరిజన ప్రాంతాల్లో సీపీఎం ఆధ్వర్యంలో కరపత్రాలతో ప్రచారం చేస్తామని తెలిపారు. బీజేపీ పాలిత ప్రాంతాల్లో అవలంబిస్తున్న గిరిజన వ్యతిరేక విధానాలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం సిగ్గుచేటన్నారు. పులుల సంరక్షణ, అడవుల సంరక్షణ పేరుతో గ్రామాలను ఖాళీ చేయించి, అటవీ భూములను కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్పేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ముంజం ఆనంద్‌కుమార్, చాపిలే సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వరద లేక వెలవెల..!



కుమురంభీం(అడ) ప్రాజెక్టు

- భారీ వర్షాలు లేక నిండని ప్రాజెక్టులు
- అలుగు దూకని చెరువులు
- ఆయకట్టు కింద వరిసాగు ఆలస్యమయ్యే అవకాశం
- ఆందోళనలో అన్నదాతలు

పెంచికల్‌పేట్: వర్షాకాలం ప్రారంభమై నెల రోజులు గడిచినా జిల్లాలో భారీ వర్షాలు కురవలేదు. జూన్ నుంచి ఇప్పటివరకు మోస్తరు వర్షాలు మాత్రమే పడ్డాయి. దీంతో చెరువులు, ప్రాజెక్టులు వరద లేక వెలవెలబోతున్నాయి. ఆలస్యం అవుతుండడంతో వరి పంట సాగుచేసే రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది ఆయకట్టు కింద నాట్లు మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉందని వాపోతున్నారు. జూన్ 1 నుంచి జూలై 12 వరకు జిల్లాలో 355.5 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా.. 322.6 మిల్లీమీటర్ల వరకు కురిసింది. సాధారణ వర్షపాతం నమోదైందని వాతావరణ శాఖ ప్రకటించింది. మహారాష్ట్రతోపాటు ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు ప్రాణహిత నది ఉప్పొంగి ప్రవహిస్తుండగా, జిల్లాలోని ప్రాజెక్టులకు మాత్రం వరద కరువైంది.

ప్రధాన ప్రాజెక్టుల్లో ఇలా..

జిల్లాలో ప్రధానంగా కుమురం భీం(అడ), వట్టివాగు, చెలిమెల, పీపీరావు ప్రాజెక్టులు ఉన్నాయి. కుమురంభీం ప్రాజెక్టు కింద 45వేల ఎకరాలు, వట్టివాగు ప్రాజెక్టు కింద 24,500 ఎకరాలు, చెలిమెల ప్రాజెక్టు కింద 6వేల ఎకరాలు, పీపీరావు ప్రాజెక్టు కింద 11,500 ఎకరాలు, బొక్కివాగు ప్రాజెక్టు కింద నాలుగు వేల ఎకరాల ఆయకట్టు ఉంది. జిల్లాలోని 563 చెరువుల కింద సుమారు 80వేల ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేస్తున్నారు. భారీ వర్షాలు లేక ప్రాజెక్టుల్లోకి ఇప్పటికీ వరదనీరు చేరలేదు. కేవలం కుమురంభీం ప్రాజెక్టు నుంచి మాత్రమే అధికారులు నీటిని దిగువ ప్రాంతాలకు వదిలారు.

జిల్లాలోని ప్రాజెక్టుల్లో నీటిమట్టం(జూలై 12 వరకు)

ప్రాజెక్టు	నీటి సామర్థ్యం (టీఎంసీలు)	ప్రస్తుత నిల్వ (టీఎంసీలు)	ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)
కుమురంభీం	10.393	5.668	2,162	5,032
వట్టివాగు	2.890	1.538	50	0
చెలిమెల	0.37	0.14	40	0
పీపీరావు	0.8	0.4	600	0

మండలాల వారీగా వర్షపాతం వివరాలు (జూన్ 1 నుంచి జూలై 12 వరకు)

మండలం	కురవాల్సింది (మి.మీ.లలో)	కురిసింది (మి.మీ.లలో)
జైనూర్	315.2	346.9
సిర్పూర్(యూ)	297.3	314.8
లింగాపూర్	393.8	310.6
తిర్యాణి	218.1	276.8
రెబ్బెన	363.6	265.8
ఆసిఫాబాద్	393.2	304.0
కెరమెరి	389.7	292.5
వాంకిడి	470.8	319.7
కాగజ్‌నగర్	414.2	298.8
సిర్పూర్(టి)	386.2	334.7
కౌటాల	367.2	358.2
చింతలమానెపల్లి	347.2	353.8
బెజ్జూర్	370.5	367.2
పెంచికల్‌పేట్	317.6	340.5
దహెగాం	287.7	354.4

బోసిపోతున్న చెరువులు

ఆశించిన స్థాయిలో వర్షాలు లేకపోవడంతో సాగుకు కీలకమైన చెరువులు నీరు లేక బోసిపోతున్నాయి. బోరుబావుల కింద రైతులు మరో పదిరోజుల్లో నాట్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు. ప్రాజెక్టులు, చెరువుల ఆయకట్టు సాగు ముందుకు సాగడం లేదు. ఇప్పటికీ అన్నదాతలు నారుమడులు కూడా సిద్ధం చేయలేదు. సుమారు 20 రోజులు వరినాట్లు ఆలస్యమయ్యే అవకాశం ఉందని అన్నదాతలు చెబుతున్నారు.

ఆగస్టు 20వరకు వరినాట్లు వేసుకోవచ్చు

వరిలో స్వల్ప, దీర్ఘకాలిక రకాల అందుబాటులో ఉన్నాయి. జిల్లాలో వర్షాలు ఆలస్యంగా కురుస్తున్న నేపథ్యంలో రైతులు స్వల్పకాలిక విత్తనాలను ఎంచుకోవాలి. 120 రోజులకు పంట చేతికి వస్తుంది. వర్షాలపై రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఆగస్టు 20 వరకు నాట్లు వేసుకోవచ్చు. వ్యవసాయశాఖ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలి.

– శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

ఉపాధికి ఊతం!



ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్, ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

- వేంపల్లిలో ఇండస్ట్రీయల్ పార్కు..
- నేడు శంకుస్థాపన చేయనున్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు
- జిల్లా అభివృద్ధికి మరో అడుగు
- ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు మేలు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: హాజీపూర్ మండలం వేంపల్లిలో ఏర్పాటు కానున్న ఇండస్ట్రీయల్ పార్క్ కొత్త పరిశ్రమల స్థాపనకు, ఉపాధి అవకాశాల సృష్టికి ఊతమివ్వనుంది. ఆదివారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, స్థానిక ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు ఈ పార్కుకు శంకుస్థాపన చేయనున్నారు.

ఎమ్మెల్యే చొరవతో..

మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని హాజీపూర్ మండలం వేంపల్లి, పోచంపాడు శివారులో 250 ఎకరాల్లో ఇండస్ట్రీయల్ పార్క్ ఏర్పాటు కానుంది. ఈ పార్క్ కోసం రైతుల నుంచి భూములు సేకరించి పరిహారం చెల్లించారు. స్థానిక ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు ఇందుకు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. నిర్మాణ పనులూ వేగవంతమవుతున్నాయి. వ్యవసాయ ఆధారిత, అనుబంధ రంగ, తయారీ, శీతల గిడ్డంగులు, పశు, పౌల్ట్రీ, పాల ఆధారిత పరిశ్రమలతోపాటు ఐటీ కంపెనీల కోసం ఐటీ హబ్‌ను సైతం ఏర్పాటు చేయనున్నారు.

సబ్సిడీలు, సౌకర్యాలు..

ఇండస్ట్రీయల్ పార్కులో పరిశ్రమలు స్థాపించే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం సబ్సిడీలు, ప్రోత్సాహకాలు అందిస్తుంది. రూ.కోటి నుంచి రూ.100 కోట్ల వరకు పెట్టుబడులతో పరిశ్రమల స్థాపనకు సౌకర్యాలు కల్పించనున్నారు. రోడ్లు, విద్యుత్, నీటి సరఫరా, రవాణా వంటి మౌలిక సదుపాయాలతోపాటు విద్యుత్ సబ్సిడీలు, రాయితీలు, రుణ సౌకర్యాలను అందించనున్నారు. జాతీయ రహదారి 63, మంచిర్యాల రైల్వే స్టేషన్ సమీపంలో ఉండడం, పెద్దపల్లి జిల్లాలో ప్రతిపాదిత విమానాశ్రయం వంటి రవాణా సౌకర్యాలు ఈ పార్క్‌ను ఆసిఫాబాద్, మహారాష్ట్ర, పెద్దపల్లి జిల్లాలకు అనుసంధానిస్తాయి.

శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు..

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు స్థానిక ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి ఆదివారం మంచిర్యాల నియోజకవర్గంలో పర్యటించనున్నారు. లక్సెట్టిపేట, దండేపల్లి, హాజీపూర్ మండలాల్లో పలు అభివృద్ధి పనులను ప్రారంభిస్తారు. లక్సెట్టిపేటలో ఆస్పత్రి భవనం ప్రారంభోత్సవం, జూనియర్ కాలేజీ, హైస్కూల్ విద్యార్థులతో భోజనం, దండేపల్లి మండలం రెబ్బెనపల్లిలో ఇందిరా మహిళా శక్తి సౌర విద్యుత్ ప్రాజెక్టుకు భూమిపూజ చేస్తారు. అనంతరం అక్కడే నిర్వహించే బహిరంగ సభలో మాట్లాడతారు. తర్వాత వేంపల్లిలో ఇండస్ట్రీయల్ పార్క్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ మెడికల్ కాలేజీ, ప్రభుత్వ ఆస్పత్రి, మాతా శిశు సంరక్షణ కేంద్రాన్ని సందర్శిస్తారు.

పోలీసులకు చిక్కిన 'ఆంధ్రా సురేశ్'

- నకిలీ విత్తనాల కేసులో పీడీ యాక్టు నమోదు
- చర్లపల్లి జైలుకు తరలింపు



సురేశ్‌కు పీడీ యాక్ట్ ఉత్తర్వులు ఇస్తున్న సీఐ

ఆసిఫాబాద్‌అర్బన్/చింతలమానెపల్లి: నకిలీ విత్తనాల సరఫరా కేసుల్లో ప్రధాన నిందితుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని భీమవరానికి చెందిన గోరంట్ల సురేశ్‌బాబు ఎట్టకేలకు పోలీసులకు చిక్కాడు. నిందితుడిపై పీడీ యాక్టు నమోదు చేసి చర్లపల్లి జైలుకు తరలించారు. శనివారం ఎస్పీ కాంతిలాల్ పాటిల్ వివరాలు వెల్లడించారు. నకిలీ విత్తనాల సరఫరా కేసులో నిందితుడు సురేశ్‌పై చింతలమానెపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఈ ఏడాది ఏప్రిల్ 4న కేసు నమోదైంది. ఈ నెల 3న రవీంద్రనగర్– 1 సమీపంలో పోలీసులు అరెస్టు చేసి విచారణ చేపట్టారు. 2018 నుంచి 2025 వరకు నకిలీ విత్తనాల సరఫరాకు సంబంధించి పలు కేసుల్లో నిందితుడిగా ఉండటంతో అతడిపై పీడీ యాక్టు నమోదు చేశారు. కౌటాల సీఐ ముత్యం రమేశ్ ఆధ్వర్యంలో చర్లపల్లి కేంద్ర కారాగారానికి తరలించారు. ప్రకాశం జిల్లా ఇంకొల్లు మండలం భీమవరానికి చెందిన గోరంట్ల సురేశ్‌బాబు జిల్లాలోని చింతలమానెపల్లి, బెజ్జూర్, సిర్పూర్(టి), ఆసిఫాబాద్ మండలాల్లో నమోదైన నకిలీ విత్తనాల సరఫరా కేసుల్లో ప్రధాన నిందితుడిగా ఉన్నట్లు ఎస్పీ తెలిపారు. గతంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నా మళ్లీ తీవ్రమైన నేరాలకు పాల్పడుతున్నట్లు గుర్తించామని తెలిపారు. శాశ్వత చర్యల్లో భాగంగా పీడీ యాక్టు నమోదు చేశామన్నారు. కాగా, మంచిర్యాల జిల్లా కన్నెపల్లి, భీమినితోపాటు జిల్లాలోని చింతలమానెపల్లి, దహెగాం మండలాలకు ఈ ఏడాది నకిలీ విత్తనాలు సరఫరా చేయడంతో ఆయా పోలీస్‌స్టేషన్లలోనూ కేసులు నమోదయ్యాయి. 'ఆంధ్రా సురేశ్ ఎవరు?' అంటూ 'సాక్షి'లో 'నకిలీ ముప్పు' పేరుతో కథనం కూడా ప్రచురితమైంది. నిందితుడిపై రామగుండం కమిషనరేట్ పరిధిలోనూ కేసులు నమోదై ఉండడంతో పోలీసులు విచారణ చేపట్టనున్నట్లు సమాచారం. జిల్లాలోని రౌడీ షీటర్లు, పాత నేరస్తులపై నిఘా ఉంటుందని, నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు.

ఎట్టకేలకు మోక్షం

- జిల్లాలో 7,154 కొత్త రేషన్ కార్డులు మంజూరు
- రేపటి నుంచి జారీ ప్రక్రియ ప్రారంభం
- సెప్టెంబర్‌లో బియ్యం అందించేందుకు ఏర్పాట్లు



ఆసిఫాబాద్: కొత్త కార్డుల మంజూరు ప్రక్రియలో ఎట్టకేలకు ముందడుగు పడింది. దరఖాస్తుదారుల ఎదురుచూపులకు త్వరలోనే మోక్షం కలగనుంది. తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలో కొత్త రేషన్‌కార్డుల పంపిణీకి ఏర్పాట్లు చేస్తోంది. పేదలకు ఆహార భద్రత కల్పించడంలో భాగంగా ఈ నెల 14న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియ ప్రారంభించనున్నారు. జిల్లా అధికారులు సైతం అందుకు తగిన ఏర్పాట్లతో సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే అధికార యంత్రాంగం సమగ్ర కులగణన సర్వే ప్రాతిపదికన లబ్ధిదారులను గుర్తించింది. అర్హులైన చాలామంది కొత్త కార్డుల కోసం, ఇప్పటికే కార్డులు ఉన్న కుటుంబాల్లో కూడా కొంత మంది పేర్లు నమోదు కాకపోవడంతో.. వారు పేర్ల నమోదు కోసం దరఖాస్తు చేసుకున్నారు. కుటుంబంలో చిన్నపిల్లలు, పెళ్లయిన కొత్త కోడళ్లు కూడా పేర్ల నమోదుకు దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వ పథకాల అమలుకు ప్రామాణికంగా తీసుకోవడంతో రేషన్ కార్డులకు ప్రాధాన్యత ఏర్పడింది.


7,154 కొత్త కార్డులు

జిల్లాలోని 335 గ్రామ పంచాయతీలు, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ మున్సిపాలిటీల్లో 314 రేషన్ దుకాణాలు ఉండగా, ప్రస్తుతం 1,39,734 రేషన్ కార్డులు ఉన్నాయి. వీటిలో 13,192 అంత్యోదయ కార్డులు కాగా, 1,26,542 ఫుడ్ సెక్యూరిటీ కార్డులు. ప్రతినెలా సుమారు 2,949.746 మెట్రిక్ టన్నుల సన్నబియ్యం కార్డుదారులకు ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. వర్షాకాలం నేపథ్యంలో ఇప్పటికే లబ్ధిదారులకు మూడు నెలల బియ్యాన్ని ఒకేసారి అందించారు. కొత్తగా జారీ చేసిన రేషన్ కార్డులకు సెప్టెంబర్ నుంచి సరుకులు ఇవ్వనున్నారు. ప్రభుత్వం సన్నబియ్యం ఉచితంగా పంపిణీ చేస్తుండడంతో కార్డులేని వారు చాలా మంది దరఖాస్తు చేసుకున్నారు. రాష్ట్రంలో కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల కోసం నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో జిల్లాలో 1,63,647 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో కొత్త రేషన్‌కార్డుల కోసం 17,044 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీటితో పాటు మీసేవ కేంద్రాల్లో సైతం కొత్తగా దరఖాస్తులు చేశారు. ప్రస్తుతం కొత్తగా 7,154 రేషన్ కార్డులు మంజూరయ్యాయి. పూర్తిస్థాయి పరిశీలన అనంతరం కొత్తకార్డులు జారీ చేస్తున్నామని అధికారులు వెల్లడించారు.

నిబంధనలివే..

కొత్త రేషన్‌కార్డుల జారీకి ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. గ్రామీణ ప్రాంతంలో వార్షికాదాయం రూ.1.5 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షల మించి ఉండకూడదు. మాగాణి 3.5 ఎకరాలు, మెట్ట అయితే 7.5 ఎకరాల మించకుండా ఉండాలి. ప్రభుత్వ, ప్రైవేటు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, వైద్యులు, కాంట్రాక్టర్లు, నాలుగుచక్రాల వాహనదారులను అనర్హులుగా పరిగణిస్తారు. కుటుంబ సభ్యుల ఆధార్ కార్డు నంబర్లతో మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవచ్చు.

వరద తగ్గింది.. బురద మిగిలింది



వానాకాలం ప్రారంభంలోనే ప్రాణహిత నది వరదలు కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల రైతుల పంటలను నాశనం చేశాయి. పత్తి మొలకెత్తుతున్న తరుణంలో వేలాది ఎకరాలను తుడిచిపెట్టాయి. మళ్లీ పంట వేసినా వరద ముప్పు తప్పదనే ఆందోళన రైతుల్లో నెలకొంది. నాలుగేళ్లుగా వరదలతో నష్టపోతున్న రైతులు.. అప్పుల భారంతో ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతున్నారు.

- వివరాలు 8లో▸

పనిచేసే కార్యకర్తలకు గుర్తింపు

- గ్రూపులు వీడి పార్టీ గెలుపునకు కృషి చేయాలి
- ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్
- జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ సంస్థాగత నిర్మాణ సమావేశం

ఆసిఫాబాద్: పనిచేసే కార్యకర్తలకు తప్పకుండా గుర్తింపు లభిస్తుందని, గ్రూపులు వీడి స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కృషి చేయాలని కాంగ్రెస్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రేమల గార్డెన్‌లో శనివారం డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాదరావు అధ్యక్షతన కాంగ్రెస్ సంస్థాగత నిర్మాణ సమావేశం నిర్వహించగా, అనిల్‌కుమార్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. అధికారంలో ఉన్నా.. లేకున్నా పార్టీ నమ్ముకుని ఉన్నవారే నిజమైన కార్యకర్తలని, అలాంటి వారికి గుర్తింపు ఉంటుందన్నారు. పార్టీ కోసం పనిచేసిన తనకు రాజ్యసభ సభ్యుడిగా అవకాశం కల్పించిందని గుర్తు చేశారు. సమావేశానికి వచ్చిన కార్యకర్తలు స్థానిక ఎన్నికల్లో గెలుపు కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. విజయంలో జిల్లాను రాష్ట్రంలోనే ముందుంచాలని సూచించారు. అంతకుముందు జిల్లా కేంద్రంలోని ఆదిలాబాద్ క్రాస్‌రోడ్ నుంచి ప్రేమల గార్డెన్ వరకు యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించి ఆయనకు స్వాగతం పలికారు.

సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

పార్టీ జిల్లా పరిశీలకుడు రమేశ్ మాట్లాడుతూ స్థానిక ఎన్నికల్లో విజయం సాధించేందుకు ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. త్వరలో జిల్లా కాంగ్రెస్ కమిటీని ఎన్నుకోనున్నట్లు తెలిపారు. ఆసక్తిగల వారు తమ బయోడేటాతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పీసీసీ ఉపాధ్యక్షురాలు సుగుణ మాట్లాడుతూ సమష్టి కృషితో స్థానిక ఎన్నికల్లో విజయం సాధించాలన్నారు. డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాదరావు మాట్లాడుతూ స్థానిక ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలన్నారు. పార్టీని గెలిపించాలని కోరారు.

18 నెలల్లోనే మార్పు

ఎమ్మెల్సీ దండె విఠల్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 18 నెలల్లోనే ఎంతో మార్పు వచ్చిందని, గతంలో ఎన్నడూ లేనివిధంగా రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లతోపాటు 65వేల ఉద్యోగాలు కల్పించిందని తెలిపారు. గతంలో మంత్రి సీతక్క సహకారంతో ఉపాధిహామీ కింద జిల్లాకు రూ.58 కోట్లు, సీఆర్‌ఆర్ కింద రూ.50 కోట్లు మంజూరయ్యాయన్నారు. రైతుల సంక్షేమం కోసం బీఆర్‌ఎస్ ప్రవేశపెట్టిన ధరణి పక్కనపెట్టి భూభారతి చట్టం అమలు చేసిందన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి అజ్మీరా శ్యాంనాయక్ మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల్లో నియోజకవర్గంలో కాంగ్రెస్ బలంగా ఉన్నప్పటికీ కొంతమంది కుట్రలతో ఓటమి పాలయ్యాయనని ఆరోపించారు. తనకు 60 వేలకు పైచిలుకు ఓట్లు సాధించేందుకు సహకరించిన కార్యకర్తలను గుర్తిస్తామన్నారు. వారికి స్థానిక ఎన్నికల్లో బీఫాంలు ఇస్తే ఆర్థికంగా సపోర్టు చేసి గెలిపించుకుంటామని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు మాట్లాడుతూ పార్టీ అధిష్టానం తమకు అన్నివిధాలా సహకరిస్తే అన్ని జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాలు కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ పదవుల్లో జిల్లాకు అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. థర్డ్ పార్టీ సర్వే చేయించి గెలుపు గుర్రాలకు బీఫాంలు ఇవ్వాలని మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌కుమార్ సూచించారు. సమావేశంలో నాయకులు సరేశ్ జాదవ్, బాలేశ్వర్‌గౌడ్, అనిల్‌గౌడ్, తిరుపతి, విశ్వనాథ్, గజ్జి రామయ్య, ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాలకు చెందిన కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అనిల్‌కుమార్ యాదవ్

ఫ్లెక్సీ వివాదం

జిల్లా కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణ సమావేశం సందర్భంగా ప్రేమల గార్డెన్‌లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీపై నియోజకవర్గ ఇన్‌చార్జి అజ్మీరా శ్యాంనాయక్ ఫొటో లేకపోవడంతో ఆయన వర్గీయులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఫ్లెక్సీలో నియోజకవర్గ ఇన్‌చార్జి ఫొటో పెట్టకపోవడం ఒక సామాజిక వర్గాన్ని చిన్నచూపు చూడడమేనని రెబ్బెన మండల నాయకుడు దుర్గం సోమయ్య అన్నారు. పార్టీలో రెండు వర్గాలు ఉండడంతో కార్యకర్తలు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు.

క్లుప్తంగా

తహసీల్దార్ విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు

జన్నారం:తహసీల్దార్ విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై అనూష తెలిపారు. ఆమె కథనం ప్రకారం..మండలంలోని రోటిగూడ గ్రామానికి చెందిన కయ్యం మల్లయ్య తన భూమి కయ్యం లావణ్య పేరిట పట్టా మార్పిడికి దరఖాస్తు చేసుకున్నాడు. శుక్రవారం సాయంత్రం అదే గ్రామానికి చెందిన కయ్యం రామన్న పట్టామార్పిడి ఎలా చేస్తారంటూ విధి నిర్వహణలో ఉన్న తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి విధులకు ఆటంకం కలిగించడమే కాకుండా పట్టామార్పిడి చేస్తే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాడు. ఈ విషయమై తహసీల్దార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రామన్నపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గుడుంబా పట్టివేత

వేమనపల్లి: నెన్నెల మండలం లంబాడితండాకు చెందిన దరావత్ రవి బైక్‌పై గుడుంబా తరలిస్తుండగా వేమనపల్లి వద్ద శనివారం పట్టుకున్నట్లు నీల్వాయి ఎస్సై శ్యాంపటేల్ తెలిపారు. అతని వద్ద 100 లీటర్ల గుడుంబా ప్యాకెట్లు పట్టుకుని బైక్ సీజ్ చేశామన్నారు. మండల కేంద్రంతోపాటు ఇతర గ్రామాలకు గుడుంబా సరఫరా చేస్తున్నట్లు నేరం ఒప్పుకున్నాడని పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి అతన్ని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

మంచిర్యాలక్రైం: స్థానిక గర్మిళ్ల సమీపంలో రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి(55) ఆత్మహత్య చేసుకున్నట్లు జీఆర్పీ ఎస్సై మహేందర్ తెలిపారు. శనివారం తమకు అందిన సమాచారంతో అక్కడికి వెళ్లి పరిశీలించగా మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని పేర్కొన్నారు. బ్లూకలర్ లుంగి ధరించి ఉన్నాడు. కుడిపక్కన ఛాతీపై ఒక పుట్టుమచ్చ ఉంది. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో భద్రపర్చినట్లు తెలిపారు. వివరాలకు 8712658596, 8328512176 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

జ్యుయెల్లరీ షాపులో భారీ చోరీ



పరిశీలిస్తున్న సీఐ సత్యనారాయణ

కెరమెరి(ఆసిఫాబాద్): మండలకేంద్రంలోని జగదాంబ జ్యుయెల్లరీ షాపులో శుక్రవారం అర్ధరాత్రి భారీ చోరీ జరిగింది. గుర్తుతెలియని వ్యక్తి షటర్‌ను రాడ్‌తో పైకి లేపి లోపలికి వెళ్లాడు. లాకర్ పగులగొట్టి సుమారు ఐదు తులాల బంగారం చోరీతోపాటు చెవి పోగులు, మంగళసూత్రాలు, పండోలిని ఎత్తుకెళ్లాడు. శనివారం తెల్లవారు జాము షాపు యజమాని ముండేవార్ శ్రీ కాంత్ వచ్చి చూడగా షెటర్ తెరిచి ఉంది. లోనికి వెళ్లి చూడగా బంగారం ఆభరణాలు మాయమయ్యాయి. సీసీ ఫుటేజీలను పరిశీలించగా ఒక వ్యక్తి ముఖానికి రుమాలు చుట్టి షాపు లాకర్‌లో నగలు తీసి జేబులో వేస్తున్నట్లు కనిపించింది. సమాచారం అందుకున్న వాంకిడి సీఐ సత్యనారాయణ, కెరమెరి ఎస్సై మధుకర్ అక్కడికి చేరుకుని ఫింగర్‌ప్రింట్లు సేకరించారు. డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీచేయగా కిలో మీటరు దూరం వరకు వెళ్లి ఆగింది. చోరీకి గురైన నగల విలువ సుమారు రూ. 5 లక్షల వరకు ఉంటుందని బాధితుడు తెలిపాడు. ఆయన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

వరద తగ్గింది.. బురద మిగిలింది



ఈ చిత్రంలో ఉన్నది రైతు మడే అక్షంత రావు. పెంచికల్‌పేట్ మండలం నందిగామ గ్రామశివారులో నాలుగెకరాల్లో పత్తి సాగు చేశాడు. మూడు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు ప్రాణహిత నదికి వరద పోటెత్తడంతో నాలుగెకరాల పత్తి నీట మునిగింది. సుమారు రూ.80 వేలు నష్టం వాటిల్లింది. తిరిగి పత్తి విత్తనాలు విత్తుకునే పరిస్థితి లేదని వాపోయాడు.



ఈ చిత్రంలో ఉన్నది రైతు దగె అంకులు. గతేడాది ఏడు ఎకరాల్లో పత్తి సాగు చేశాడు. ఎకరాకు సుమారు రూ.20 వేల పెట్టుబడి పెట్టాడు. గతేదాది వర్షాలతో దిందా గ్రామం సమీపంలోని వాగుకు వరద లొచ్చాయి. ప్రాణహిత నది ముంపు నీటిలో పత్తి మునిగింది. వారం రోజులకు పైగా వరద నీటిలో ఉండడంతో మొక్కలు కుళ్లిపోయాయి. సుమారు రూ.లక్షకుపైగా నష్టం వాటిల్లింది. అధికారులు పంట నష్టం సర్వే నిర్వహించినా పరిహారం అందించలేదు.



వరదలో మునిగి కుళ్లిపోయిన పత్తి మొక్కలు

- పంటలను ముంచిన ప్రాణహిత • ఆదిలోనే అన్నదాత ఆశలను తుంచిన వరద
- మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాలో వేల ఎకరాల్లో పంట నష్టం
- మళ్లీ విత్తనాలు విత్తుకోవాల్సిందే.. • ఏటా నష్టపోతున్నా.. అందని పరిహారం

చింతలమానెపల్లి/పెంచికల్‌పేట్/వేమనపల్లి: వానాకాలం ప్రారంభంలోనే ప్రాణహిత నది వరదలు కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల రైతుల పంటలను నాశనం చేశాయి. పత్తి మొక్కలు మొలకెత్తుతున్న తరుణంలో వచ్చిన ఈ వరదలు వేలాది ఎకరాల పంటలను తుడిచిపెట్టాయి. గత నాలుగేళ్లుగా ఇలాంటి వరదలతో నష్టపోతున్న రైతులు, అప్పుల భారంతో ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతున్నారు. ఈ కథనం ద్వారా వరదల ప్రభావం, రైతుల నష్టాలు, పరిహారం కోసం వారి ఆవేదనను వివరిద్దాం.

వరదలతో పంట నష్టం..

ప్రాణహిత నది ఉధృతి కారణంగా కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లోని నదీతీర ప్రాంతాల్లో పత్తి పంటలు నీటమునిగాయి. వేమనపల్లి, కోటపల్లి, దహెగాం, బెజ్జూర్, కౌటాల మండలాల్లో వేలాది ఎకరాల పంటలు మూడు నాలుగు రోజుల పాటు నీటిలో మునిగి కుళ్లిపోయాయి. మొలక దశలోనే ఉన్న పత్తి మొక్కలు వరదలో కొట్టుకుపోయాయి. వరద తగ్గిన తర్వాత చేలల్లో ఒండ్రు మట్టి, బురద, ఇసుక మేటలు పేరుకుని, పంటలు పూర్తిగా నాశనమయ్యాయి. మళ్లీ పంట వేసినా వరద ముప్పు తప్పదనే ఆందోళన రైతుల్లో నెలకొంది.

నాలుగేళ్లుగా నష్టాలే..

గత నాలుగేళ్లుగా ప్రాణహిత నది వరదలు రైతుల పంటలను నాశనం చేస్తున్నాయి. అప్పులు చేసి పంట సాగు చేసిన రైతులు, నష్టాలతో ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోతున్నారు. ఒక్కో ఎకరం పత్తి సాగుకు రూ.16 వేల నుంచి రూ.20 వేల ఖర్చవుతుందని, విత్తనాలు, ఎరువులు, కల్టివేటర్, కైకిలి ఖర్చులు తీర్చే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల ప్రాథమిక అంచనాల ప్రకారం, వేమనపల్లిలో 1,790 ఎకరాలు, కోటపల్లిలో 2,500 ఎకరాలు, బెజ్జూర్‌లో 1,200 ఎకరాలు, దహెగాంలో 900 ఎకరాలు, కౌటాలలో 1,800 ఎకరాల్లో పత్తి పంట నష్టపోయింది. రైతులు సమగ్ర సర్వే నిర్వహించి నష్టపరిహారం అందించాలని కోరుతున్నారు.



పెంచికల్‌పేట్ మండలం నందిగామ శివారులో నీట మునిగిన పత్తి చేనులో రైతు

ప్రాణహిత–పెన్‌గంగ ప్రభావం..

సిర్పూర్(టి) నియోజకవర్గంలో ప్రాణహిత, పెన్‌గంగ నదులు ప్రవహిస్తాయి. సిర్పూర్(టి), కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్, పెంచికల్‌పేట, దహెగాం మండలాల్లో ఈ నదుల తీర ప్రాంతాలు వరదల ప్రభావానికి గురవుతున్నాయి. మహారాష్ట్రలోని ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలు, పెన్‌గంగ, వార్దా తదితర నదులపై ప్రాజెక్టుల గేట్లు ఎత్తివేయడం వల్ల ప్రాణహితలో నీటి ప్రవాహం పెరుగుతోంది. గోదావరిలో ఉధృతి పెరిగినప్పుడు ప్రాణహిత నది ప్రవాహం అడ్డుకోబడి, వరద నీరు నిలిచిపోతుంది. దీంతో నదిలో కలిసే వాగులు, కాలువల నీరు పరిసర భూముల్లోకి చేరి పంటలను నాశనం చేస్తోంది. ఈ వరదలు 3 నుంచి 15 రోజుల వరకు కొనసాగుతాయి.

వేలాది ఎకరాల నష్టం..

దహెగాంలో 12 గ్రామాలు, పెంచికల్‌పేటలో 8 గ్రామాలు, బెజ్జూర్‌లో 14 గ్రామాలు, చింతలమానెపల్లిలో 10 గ్రామాలు, కౌటాలలో 8 గ్రామాలు, సిర్పూర్‌లో 9 గ్రామాలు వరదల బారిన పడ్డాయి. ఈ ప్రాంతాల్లో వరద నీరు నిలిచిపోవడంతో పత్తి, వరి, ఇతర పంటలు మునిగిపోయాయి. పెంచికల్‌పేట మండలంలో మురళీగూడ, జిల్లెడ, నందిగామ, కమ్మర్‌గాం గ్రామాల్లో సుమారు 400 ఎకరాల పత్తి నీటమునిగింది. గతేడాది చింతలమానెపల్లిలో 1,200 ఎకరాల్లో పంటలు నష్టపోయినా, అధికారులు సర్వే నిర్వహించినప్పటికీ పరిహారం అందలేదు.

పరిహారం, నష్ట నివారణ చర్యల లేక..

ఏటా పంటలు మునిగినప్పటికీ, ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందడం లేదు. ముంపు ప్రాంతాలను గుర్తించి, ప్రత్యామ్నాయ పంటలు, రాయితీపై విత్తనాలు, ఎరువులు అందించడం వంటి చర్యలు చేపట్టడం లేదు. వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులకు ఈ ప్రాంతాలపై అవగాహన లేకపోవడం, వరద సమయంలో హెచ్చరికలు తప్ప మరో మద్దతు అందకపోవడంపై రైతులు విమర్శిస్తున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు కూడా ఒత్తిడి తెచ్చేందుకు విఫలమవుతున్నారని ఆరోపణలు ఉన్నాయి.

పంటల బీమా ఉంటే..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పంటల బీమా పథకం అమలులో ఉండేది. అయితే, తెలంగాణ ఏర్పడిన తర్వాత టీఆర్‌ఎస్ ప్రభుత్వం ఈ పథకాన్ని రద్దు చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు పంటల బీమా పథకాన్ని తిరిగి అమలు చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ, అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర దాటినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోతున్న రైతులకు ఆర్థిక మద్దతు అందక, తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పరిహారం అందించాలి



ప్రాణహిత వరదలకు పంటలు కొట్టుకుపోయాయి. పెద్ద ఎత్తున పంట నష్టం జరిగిన నేటికి అధికారులు గ్రామాల వైపు రావడం లేదు. ప్రభుత్వం, అధికారులు స్పందించి సర్వే చేసి పరిహారం అందించాలి.

– ఆత్రం వసంత్, రైతు, జిల్లెడ

వందల ఎకరాలు మునిగింది



గతేడాది వందల ఎకరాల్లో పత్తి, వరి పంటలు మునిగిపోయాయి. పంటలు విత్తుకుని మొలకెత్తే, ఎదిగే దశలో వరదలు వస్తే పంటలు కాపాడుకోలేని పరిస్థితి. వ్యవసాయమే జీవనాధారంగా ఉన్న మాకు దిక్కు లేకుండా పోయింది. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి.

– దోకె తిరుపతి, దిందా, చింతలమానెపల్లి

ముంపు ప్రాంతంగా ప్రకటించాలి



సుంపుటం శివారులో ఎనిమిది ఎకరాలు పత్తి సాగు చేశాను. ప్రాణహిత వరదలో గత నాలుగేళ్లుగా పంటలు మునుగుతూనే ఉన్నాయి. పంటకు నష్టపరిహారం లేదు. లోతట్టు భూములు ముంపు ప్రాంతంగా ప్రకటించి ప్రభుత్వం పరిహారం అందించాలి.

– కుబిడె తిరుపతి, సుంపుటం

గుండె తరుక్కుపోతుంది



ఆరు ఎకరాల పత్తి సాగుచేసినా. వరదలకు మొత్తం మునిగింది. చేనుకాడికి వచ్చి పంటను చూస్తే గుండె తరుక్కుపోతుంది. దుక్కి కాడి నుంచి విత్తనం ఎరువుల దాక అప్పులు తెచ్చి పెట్టినం. పంటే పోయింది. అప్పు ఎట్ల తీరుతదోనని రంధీ పడ్తాన్నం.

– చిన్న లక్ష్మి, సుంపుటం

ఈ సర్కారన్న ఇయ్యాలే



ఐదు ఎకరాల పత్తి సాగు చేసినా. ఈ యేడు కాదు పోయిన నాలుగేళ్ల సంది పంటలు మునుగుతూనే ఉన్నాయి. అప్పట్ల ఆ సర్కారు పరిహారం ఇయ్యాలే. ఎవలైతే పంట నష్టం గూర్చి రాయడానికి అత్తలేరు. ఈ సర్కారు ఎంతో కొంత ఇత్తదని ఆశ ఉన్నది.

– దందెర పెంటయ్య, వేమనపల్లి



ఆసిఫాబాద్ జిల్లాలో యెల్లో పిజియాన్

కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా దహెగా మండల కేంద్రంలో శనివారం అరుదైన యెల్లో పిజియాన్ పక్షి కనిపించింది. ఉదయం మూడు పక్షులు ఎగురుకుంటూ వస్తున్న క్రమంలో ఓ భవనం గోడకు తగిలి కింద పడ్డాయి. అక్కడే ఉన్న స్థానికులు వాటిని పట్టుకున్నారు. రెండు పక్షులు చనిపోయాయి. పత్తి చేలపై చల్లిన క్రిమిసహారక మందుల ప్రభావానికి చనిపోయిన పురుగులను తినడం వలన ఇవి చనిపోయి ఉంటాయని ఎఫ్ఎస్‌వో సద్దాం తెలిపారు. ఈ పక్షి పేరు యెల్లో పుటెడ్ గ్రీన్ పిజియాన్ (పసుపు పాదాల ఆకుపచ్చ పావురం) అని పేర్కొన్నారు. – దహెగాం

ఆలయాన్ని అభివృద్ధి చేసి తీరుతాం

- వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి
- పర్యాటకంగానూ తీర్చిదిద్దుతాం
- మంత్రులు కొండా సురేఖ, వివేక్
- బాసర ఆలయంలో ప్రత్యేకపూజలు
- ధర్మశాల పునరుద్ధరణ ప్రారంభం
- ట్రిపుల్‌ఐటీ కళాశాల సందర్శన



టీటీడీ గదుల ధర్మశాల పునరుద్ధరణకు ప్రారంభోత్సవం చేస్తున్న మంత్రులు సురేఖ, వివేక్, ఎంపీ నగేశ్, ఎమ్మెల్యే రామారావు పటేల్, కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకీ షర్మిల



పూజలు చేస్తున్న మంత్రులు సురేఖ, వివేక్, ఎంపీ నగేశ్, ఎమ్మెల్యే రామారావు పటేల్, కలెక్టర్, ఎస్పీ

భైంసా/బాసర: బాసర శ్రీజ్ఞానసరస్వతీ ఆలయాన్ని నభూతో న భవిష్యత్ అన్న రీతిలో అభివృద్ధి చేసి తీరుతామని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ, అటవీశాఖ మంత్రి కొండా సురేఖ హామీ ఇచ్చారు. శనివారం కార్మికశాఖ మంత్రి వివేక్ వెంకటస్వామితో కలిసి బాసర శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి సురేఖ సరస్వతీ అమ్మవారి ప్రాశస్త్యాన్ని వివరించారు. బాసర అభివృద్ధికి డీపీఆర్ సిద్ధం చేశామని చెప్పారు. త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డి ఆమోదంతో అభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం ఆలయ అభివృద్ధిని విస్మరించిందని ఆరోపించారు. బాసర ఆలయ అభివృద్ధికి అవసరమై కేంద్రం నిధులు రాబట్టేందుకు ఉమ్మడి జిల్లాకు చెందిన ఇద్దరు ఎంపీల సహకారం తీసుకుంటామని కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ పెద్దలతోనూ చర్చించి పర్యాటకంగా బాసరక్షేత్రాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. ఎంపీ నగేశ్ మాట్లాడుతూ..గత ప్రభుత్వం ఆలయాభివృద్ధికి రూ.50 కోట్ల నిధులిచ్చి అందులో రూ.8 కోట్లే ఖర్చు చేసి మిగతాది వెనక్కి తీసుకుందని విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వం వెనక్కివెళ్లిన నిధులు విడుదల చేయాలని కోరారు.

పవర్‌పాయింట్ ప్రజెంటేషన్

బాసర సరస్వతీ అమ్మవారి ఆలయ అభివృద్ధి పనులను నాలుగు భాగాలుగా కేటాయించి రూపొందించిన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌ను కలెక్టర్ అభిలాష అభినవ్, దేవాదాయ శాఖ అధికారులు ప్రదర్శించారు. మొదటిభాగంలో అమ్మవారి ఆలయ విస్తరణ, క్యూకాంప్లెక్స్‌లు, గర్భగుడి విస్తరణ, చుట్టూ ప్రాకారాల నిర్మాణాలు ప్రదర్శించారు. పక్కనే గుట్టపై మరో వంద గదుల సత్రం, 300 కార్లు నిలిపేలా పార్కింగ్ స్థలంతో నమూనాను సిద్ధం చేశారు. రెండవ ప్రదర్శనలో బాసర గోదావరినదికి వెళ్లే మార్గంలో అమ్మవారి ఆలయానికి సంబంధించిన ఎనిమిది ఎకరాల్లో 50 అడుగుల సరస్వతీ ఆలయం, లేజర్ ప్రదర్శన, భక్తులు సేద తీరేలా డార్మెంటరీ నిర్మాణం చేపట్టేలా, రాత్రివేళ ప్రదర్శనలు ఇచ్చేలా నమూనాలు రూపొందించారు. ఇక అమ్మవారి ఆలయానికి ఆదాయం వచ్చేలా ఓ కన్వెన్షన్ హాల్ నిర్మించేలా ప్రతిపాదించారు. పలు ప్రైవేట్ కంపెనీల సమావేశాలు, వివాహాలు, శుభకార్యాల నిర్వహణపై వచ్చే ఆదాయం పెరిగేలా నమూనా వేశారు. మూడో ప్రదర్శనలో బాసర గోదావరినది తీరంలో అమ్మవారి ఆలయానికి సంబంధించి మరో 20 ఎకరాలకుపైగా భూములున్నాయి. ప్రస్తుతం గోదావరి నదిఒడ్డునే పిండప్రదానం, పక్కనే శివాలయం, అటు పక్కనే అల్పాహారాల విక్రయ కేంద్రాలు కనిపిస్తుంటాయి. అలాకాకుండా పిండప్రదానాలకు వేరే చోట నిర్మాణాలు, శివాలయాన్ని విస్తరించడం, సువిశాలంగా ఉన్న స్థలాన్ని అందంగా తీర్చిదిద్దితే గోదావరి నది దృశ్యాలు ఆహ్లాదం పంచేలా నిర్మాణాలు చేపట్టే నమూనాను వివరించారు. నాలుగో ప్రదర్శనలో బాసర రైల్వేస్టేషన్ సమీపంలో ఆలయానికి సంబంధించిన భూమిలో సిబ్బంది, ఉద్యోగులకు వసతి సౌకర్యంతోపాటు భక్తులకు విశ్రాంతి భవనం నిర్మించేలా నమూనా రూపొందించారు. ప్రైవేట్ వాహనాలు నిలిపి భక్తులను అమ్మవారి క్షేత్రానికి తరలించేలా.. ఆన్‌లైన్‌లో వెహికిల్ బుకింగ్ చేసుకునేలా కౌంటర్లు ఏర్పాటు చేయాలని వివరించారు. రైలు మార్గం ద్వారా వచ్చే భక్తులు అక్కడే విశ్రాంతి తీసుకునేలా ఏర్పాట్లు చేయాలని చర్చించారు.

ట్రిపుల్‌ఐటీలో మొక్కలు నాటి..

వనమహోత్సవంలో భాగంగా బాసర ట్రిపుల్‌ఐటీలో అటవీశాఖ మంత్రి కొండా సురేఖ మొక్కలు నాటారు. అనంతరం కాన్ఫరెన్స్ హాల్‌లో ఆమె మాట్లాడుతూ.. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి బాసరలో ట్రిపుల్‌ఐటీ నెలకొల్పడంతోనే ఇప్పుడు వేలాది మంది విద్యార్థులకు విద్య, ఉద్యోగ అవకాశాలు వస్తున్నాయని తెలిపారు. విద్యార్థుల అవసరాలు, సమస్యలపై కలెక్టర్ నివేదిక పంపితే సీఎంతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ట్రిపుల్‌ఐటీ అభివృద్ధికి నిధులివ్వాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో కలెక్టర్ అభిలాష అభినవ్, ట్రిపుల్‌ఐటీ వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్, అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిశోర్ కుమార్, ఎస్పీ జానకీ షర్మిల, మాజీ ఎమ్మెల్యేలు విఠల్‌రెడ్డి, నారాయణరావుపటేల్, వేణుగోపాలాచారి పాల్గొన్నారు.

నిరాహార దీక్షకు దిగుతా..

బాసర అమ్మవారి ఆలయ అభివృద్ధి విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ ఆరోపించారు. మాస్టర్ ప్లాన్ అమలుపై తమకు మళ్లీ నిరాశే మిగిలిందని తెలిపారు. ఆలయ గర్భగుడి, ఇతర అభివృద్ధి పనుల విషయంలోనూ ప్రభుత్వంతోపాటు మంత్రులను తాను పలుసార్లు కలిశానని, అసెంబ్లీలోనూ ప్రస్తావించానని చెప్పారు. వచ్చే దసరా, దీపావళి వరకైనా నిధులిచ్చి అభివృద్ధి చేయాలని కోరారు. లేని పక్షంలో తాను అమ్మవారి ఆలయం ఎదుట నిరాహార దీక్షకు దిగుతానని తెలిపారు. ప్రభుత్వం నిధులివ్వకుంటే భిక్షమెత్తైనా ఆలయాన్ని బాగు చేసుకుంటామని చెప్పారు. ఆలయానికి బెంగళూర్‌కు చెందిన ఓ దాత రూ.4 కోట్లు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే ప్రకటించారు.

డిజీల్‌లో నీళ్లు



ఆందోళన చేస్తున్న వాహనదారులు

భీమిని: డిజీల్‌లో నీళ్లు రావడంతో ట్రాక్టర్ల నుంచి పొగలు వచ్చి ఆగిపోయాయని కన్నెపల్లి మండలం టేకులపల్లి క్రాస్‌రోడ్డు వద్ద గల హన్‌మాన్ ఫిల్లింగ్ స్టేషన్ (ఇండియన్ ఆయిల్ బంక్) వద్ద యజమానులు, డ్రైవర్లు ఆందోళనకు దిగారు. శనివారం ఉదయం బంక్‌లో పలువురు యాజమానులు, డ్రైవర్లు ట్రాక్టర్‌లో డీజీల్ పోయించుకుని వెళ్లారు. కొద్దిసేపటికి ట్రాక్టర్ల నుంచి పొగలు వచ్చి ఆగిపోయాయి. నీళ్లు కలిసిన డీజిల్ ట్రాక్టర్లలో పోశారని గమనించారు. యజమానులు క్యాన్లలో తీసుకెళ్లిన డీజిల్‌ను బంక్‌కు తీసుకువచ్చి పరిశీలించగా నీళ్లు కలిసినట్టుగా గుర్తించారు. వెంటనే బంక్ యజమానిని నిలదీశారు. తమ వాహనాలకు మరమ్మతు చేసి ఇవ్వాలని ఆందోళనకు దిగారు. బంక్ యజమాని మెకానిక్‌లు పిలిపించి మరమ్మతు చేయించి ఇస్తానని, వాటి మరమ్మతు ఖర్చులు తానే భరిస్తానని హామీ ఇవ్వడంతో వారు శాంతించారు.

చెడ్వాయి ఎఫ్‌బీవో సస్పెన్షన్?

పెంచికల్‌పేట్: పెంచికల్‌పేట్ రేంజ్ పరిధిలోని చెడ్వాయి బీట్ అధికారి మనోహర్‌ను సస్పెండ్ చేసినట్లు సమాచారం. చెడ్వాయి బీట్ పరిధి పోతెపెల్లి గ్రామానికి చెందిన ట్రాక్టర్ యజమాని శేఖర్ పోడుభూముల్లో ట్రాక్టర్ పనులు చేసినట్లుగా బెదిరించి రూ.18 వేలు వసూలు చేశాడు. ఈవిషయాన్ని శేఖర్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాడు. విచారణ అనంతరం వేటు వేస్తూ చర్యలు తీసుకున్నట్లుగా సమాచారం. ఈవిషయమై ఎఫ్ఆర్వో అనిల్ కుమార్‌ను సంప్రదించగా ఉన్నతాధికారుల నుంచి ఇంకా ఆదేశాలు రాలేదని తెలిపారు.



ప్రమాదమని తెలిసినా తప్పదు..

వేమనపల్లి: ప్రమాదకరమైన వంతెన గోడ మీద నుంచి మహిళా రైతులు శనివారం పత్తి చేళ్లల్లోకి పనులకు వెళ్తున్నారు. మండల కేంద్రంలోని ఎంచపాయ రూట్‌లో వేలాది ఎకరాల వ్యవసాయ భూములున్నా రోడ్డు సౌకర్యం లేదు. ప్రాణహిత వరదతో నాలుగు రోజులుగా రాకపోకలు నిలిచిపోయాయి. వరద తగ్గగా బురద రోడ్డు నుంచి వెళ్లలేక నీల్వాయి ప్రాజెక్టు 5 ఆర్ కాలువ వయా డాక్ట్(వంతెన) గోడ మీద నుంచి, లోపల నుంచి ఇలా రైతులు చేలల్లోకి వెళ్తున్నారు. ఏమాత్రం పక్కకు అడుగేసినా ఎనిమిది మీటర్ల ఎత్తు నుంచి నీళ్లల్లో పడిపోవాల్సిందే.

అధిక వడ్డీ వసూలు చేస్తున్న ముగ్గురిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: అమయాక ప్రజల నుంచి అధిక వడ్డీ వసూలు చేస్తున్న ముగ్గురిపై కేసులు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్ తెలిపారు. బాధితులు పోలీసులను ఆశ్రయించడంతో పట్టణంలోని అంబేద్కర్‌నగర్‌కు చెందిన బంగారి బాలాజీ –రంజనబాయి దంపతుల ఇంట్లో సోదాలు నిర్వహించారు. అదే కాలనీలో దీపక్ ఇంట్లో సైతం తనిఖీలు చేశారు. వారి వద్ద నుంచి ప్రామిసరీ నోట్లు, సెల్ డీడీలు, బ్యాంకు చెక్‌లు ఇతర పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసులునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

'సాహితీ విపంచి' ఆవిష్కరణ



సాహితీ విపంచి సంపుటిలతో కవులు

మంచిర్యాలఅర్బన్: పట్టణంలోని సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో జిల్లా సాహితీ సంరక్షణ సమితి ఆధ్వర్యంలో శనివారం సాహితీ విపంచి సంపుటి -6ను కవి అన్వర్ అవిష్కరించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన 125 మంది కవులు రచించిన సంపుటి పద్యవిభాగంలో 25 గేయ విభాగంలో 77 కవితలు రాయటం జరిగింది. ఈసందర్భంగా అన్వర్ మాట్లాడుతూ సాహితీ సంస్థ ఏర్పాటు చేసి 17 సంవత్సరాలుగా ప్రతీ మాసంలో రెండు సాహితీ కార్యక్రమాలు నిర్వహించటం గొప్ప విషయమన్నారు. కవులు మలయశ్రీ, ఐవీ సుబ్బాయమ్మ, సంస్థ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడు అనంద్‌రావు, మహిళా కార్యదర్శి శ్రీలక్ష్మీ, శ్రీనాథ్‌గౌడ్ సాహితీ విపంచి పుస్తక సమీక్షించారు. ఈసందర్భంగా ఉమ్మడి జిల్లా నుంచి వచ్చిన కవులను శాలువాలతో సత్కరించి సాహితీ విపంచి సంపుటిని అందజేశారు. కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షుడు పట్వర్ధన్, అధ్యక్షుడు వామన్‌రావు, కవులు చంద్రశేఖర్, బ్రహ్మయ్య, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.